ఏడు రోజుల మజిలీ!

బి. రాజేశ్వరి

కెమెరా భుజాన తగిలించుకుని, మంచి ఏంగిల్ కోసం ఏట వాలుగా వున్న కొండ దిగువకు దిగుతున్నాడు తిలక్.

"ఇంకా కిందికి దిగకండి, జారిపోతారు!" హెచ్చరించింది లలిత.

"ఏం ఫరవాలేదు. నిన్ను ఎవరూ తియ్యని తియ్యలేని విధంగా ఫోటోతీస్తాను. నువ్వే సర్టిఫికేట్ యిచ్చావు కదా, స్టూడియో పెట్టుకుంటే వేలకువేలు సంపాదించగలనని! మరి పేరు నిలబెట్టుకోవాలి కదా!" అన్నాడు నవ్వుతూ.

"ఏమో బాబూ, కింద అంతా లోయలు, బండ రాళ్ళు! ఏమాత్రం కాలుజారినా యింక చెప్పేదేముంది? పోతే పోనివ్వండి పాడు ఫోటోలు. పైకి వచ్చెయ్యండి!"

"ఉహుఁ! నేననుకున్నది సాధించకుండా రాను."

"ఇంకా యెక్కడికి దిగిపోతున్నారు? ఓ పక్క లైటింగ్ ఫేడయిపోతోంది. సూర్యుడు అస్తమించ

బోతున్నాడు."

"ఇదే మంచి టైము. చూస్తుండు అస్తమించే సూర్య కిరణాల బంగారు వర్ణం నీ వంటి రంగుతో పోటీపడి ఈ కలర్ ఫిల్ముమీద ఎంత బాగా ముద్రింపబడుతోందో!" తిలక్ బండరాయికి చేరగిలబడి ఏంగిల్ సరిచేసుకుని క్లిక్ మనిపించాడు.

"ఇక చాల్లే వచ్చెయ్యండి. గెస్టు హౌస్ కి పోదాం."

"ఉహూ! మరో రెండు స్నాప్స్ తియ్యనివ్వు!" అంటూ వెనక్కి జరుగుతున్న తిలక్ ని లలిత వారిస్తూనే వుంది. కానీ అప్పటికే ఆలస్యమయిపోయింది. వెనక బండరాయి ఉన్నదనే ధీమాతో వెనక్కి చేరబడపోయిన తిలక్ చటుక్కున తూలి, పక్కకు తిరిగి చూడబోయాడు. ఏ ఆధారమూ లేకపోవటంతో జర్రున వెనక్కి వేగంగా జారిపోసాగాడు.

పైనుంచి లలిత కేకలు పెడుతోంది. తిలక్ ఏటవాలుగా జారిపోతూనే ఉన్నాడు.

లలిత చటుక్కున తనూ ఏటవాలుగా ఉన్న కొండ కంగారుగా దిగి భర్తను పట్టుకోవాలనుకుంది. కాని అతను అప్పటికే జారిపడిపోయాడు.

లలిత కెవ్వున కేక వేసింది. పట్టుకోవటానికి ఎలాంటి ఆధారమూ లేదు. అయినా అలాగే కాలు నిలదొక్కుకుంటూ ఏటవాలుగా ఉన్న కొండ దిగింది.

కింద లోయ మరీ ప్రమాదకరంగా లేదు. అక్కడ బండరాళ్ళుగాని, మొన తేలిన రాళ్ళుగాని లేవు మైదానంలాగా యిసక పర్ర వుంది.

లలిత కళ్ళు తిలక్ కోసం వేగంగా వెతుకుతున్నాయి. అతను కిందికి జారిపడటం స్వయంగా చూసింది. కాని

అతను ఆ చుట్టుపక్కల ఎక్కడా లేడు.'

లలితకు గుండె దడదడ కొట్టుకుంటోంది. అక్కడ జనసంచారం లేదు. బిక్కు బిక్కుమంటూ వుంది. ఓ పక్క చీకటి అలుముకుంటోంది.

"ఏమండీ" అంటూ నాలుగైసార్లు పిలిచింది. కాని సమాధానం లేదు.

"తిలక్, తిలక్" అంటూ పేరుపెట్టి పిలిచింది. అయినా తిలక్ జాడ లేదు.

ఆమెకు ఏడుపొచ్చినంత పనయింది. తన కళ్ళముందు జారిపడిన భర్త యింతలో ఏమయినట్టు? కొండ చుట్టూ పరీక్షగా చూసింది. చుట్టూ జీడిమామిడి చెట్లు గుబురుగా కిందికి వాలి పెరిగి వున్నాయి. ఎండుటాకులమీద ఏదో నడుస్తున్న చప్పుడు!

ఆమె చెవులు రిక్కించి విన్నది. ఆమె గుండె చప్పుడు ఆమెకే వినిపిస్తోంది.

ఓ ముంగిస అటునుంచి యిటు పరుగెత్తింది.

మళ్ళీ ఎండుటాకులమీద చప్పుడు. ఏదో జరజర పాకిన సవ్వడి! ఆమె వెన్నున చలిపుట్టింది.

ఓ పక్క చీకటి బాగా ముసురుకుంటోంది.

తిలక్ జాడ ఎక్కడా లేదు.

లలిత అడుగులో అడుగు వేసుకుంటూ కొండ చుట్టూ మళ్ళీ పరికించి చూసింది.

సరిగ్గా అప్పుడే ఏదో భయంకర ఆకారం ఆమె ముందుకొచ్చి నిల్చుంది.

ఒక్కసారిగా కెవ్వుమంటూ అరిచి నేలమీద పడిపోయింది. ఆమెకు స్పృహ తప్పిపోయింది.

2

లలితకు మెలకువ వచ్చేసరికి పక్కమీద పడుకుని వున్నది. కెవ్వున లేచింది.

అంతవరకు ఆమె ముఖంలోకే ఆత్రుతగా చూస్తున్న తిలక్ కనిపించాడామెకు.

చుట్టూ పరికించింది. గెస్టు హౌస్‌లోని తాము బస చేసిన గదే అది! తనిక్కడికెలా వచ్చింది?

ఆమె ఒంటినిండా చెమట్లు! జాకెట్టు పూర్తిగా తడిసి పోయింది. పెట్టుకున్న కుంకుమ కరిగి ముక్కుమీదకు పాకిపోయింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు చాలా వేగంగా బరువుగా వున్నాయి.

"లల్లీ, నేను... తిలక్‌ని! ఎలా వుంది?" అంటున్నాడు తిలక్ భార్యను కుదుపుతూ.

"ఏమండీ, మీరు మీరేనా....?" అన్నది లలిత తడబడుతూ.... ఆమె పెదాలు ఒణుకుతున్నాయి.

తిలక్ జగ్‌నుంచి నీళ్ళు వంచి గ్లాసు తెచ్చి ఆమె నోటికందించాడు. గటగట తాగేసింది. మరో గ్లాసు నీళ్ళు వంచి ఆమెకిచ్చాడు. ఆ గ్లాసు నీళ్లు తాగి, గ్లాసు పక్కన పెట్టింది. భర్తవంక పిచ్చిగా చూస్తోంది.

"లల్లీ, ఏమిటా చూపు? ఎందుకంత గాభరాపడి పోయావు? ఏం జరిగింది?" అన్నాడు తిలక్.

ఆమె జరిగిపోయిన సంఘటనను గుర్తుచేసుకుని భయంలో వణికిపోయింది.

"మీరేమైపోయారు? నన్నిక్కడికెవరు తీసుకొచ్చారు?" అన్నది గొంతు పెకల్చుకుని.

"నేను ఆ పక్కనే బండ వెనక దాక్కుని నిన్ను ఆట పట్టిద్దామని చూస్తున్నాను. నువ్వు కొండ దిగి

రావటం చూశాను. నన్ను వెతుక్కోవటం చూసి నవ్వుకున్నాను. నన్ను పేరుపెట్టి పిలుస్తూ నువ్వు కొండకి అవతల పక్కగా నడుస్తున్నావు. నేను నీ వెనకనే వద్దామనుకుని బండ వెనకనుంచి లేచాను. కాని అంతలోనే నువ్వు పెద్దగా కేక పెట్టావు. నేను పరుగున వచ్చేసరికి నువ్వు స్పృహతప్పి పడిపోయావు. నాకు భయంవేసింది. నిన్ను భుజాన వేసుకుని కొండని చుట్టి ఆ పక్కగా తిరిగి గెస్టు హౌస్‌కి తీసుకొచ్చాను" అన్నాడు తిలక్.

లలిత యింకా విభ్రాంతినుంచి తేరుకోలేదు.

"మీ గురించి వెతుకుతూ కొండకి అవతలపక్కకు వెళ్లాను. అదే సమయానికి ఓ భయంకరమైన వ్యక్తి— నల్లగా పొడవుగా వున్నాడు. దుబ్బుగా పెరిగిపోయిన గడ్డం, ఎర్రటి కనుగుడ్లు సూటిగా నా వంకనే చూస్తూ వంకరగా నవ్వుతూ కనిపించాడు. నన్ను చూసి మీదికొచ్చాడు - అంతే, భయంతో ఒక్క కేక వేసి పడిపోయాను. అంతే తెలుసు నాకు!"

"ఛ, ఏదో భ్రమపడివుంటావు. నేను వెంటనే పరుగెత్తుకొచ్చాను కదా, నాకు అక్కడెవరూ కనిపించలేదు!"

"అబ్బా, నేను స్వయంగా నా కళ్ళతో చూశాను. అతను మనిషిలా కనిపించలేదు. ఏదో ఆటవికుడిలాగా, ఆదిమానవుడిలాగా కనిపించాడు. ఒంటిమీద బట్టలేదు. నల్లటి పాంటు అతని ఒంటి రంగులో కలిసిపోయి వికృతంగా కనిపించింది. మనము సినిమాల్లో చూసే చింపాంజీలా వున్నాడు. అబ్బ....తలుచుకుంటేనే ఒళ్ళు కంపరమెత్తిపోతోంది. గుర్తొస్తేనే చాలు, వణుకు పుట్టుకొస్తోంది" లలిత నిజంగానే వణికిపోతోంది.

"ఒంటరితనం వల్ల జడుసుకుని వుంటావు అంతే! పడుకుని బాగా విశ్రాంతి తీసుకో!" అన్నాడు తిలక్. భార్య మాటలకి నవ్వొస్తోంది. కాని పైకి నవ్వితే ఆమె ఉడుక్కుంటుందని నవ్వును అణచుకున్నాడు.

టేబిల్ మీద కేరియర్‌లో భోజనం అలాగే వుంది. తిలక్ దాన్ని విప్పిన జాడలేదు!

"మీరు భోంచెయ్యలేదా?" అన్నదామె.

"ఉహుఁ! నువ్వు లేచాక చెయ్యొచ్చునని యెదురు చూస్తున్నాను. నువ్వు చాలా సేపు తెలివితప్పి పడి పోయావు! గెస్టు హౌస్‌లో ఓ డాక్టరు దిగటం మన అదృష్టం! వాచ్‌మన్ ఆయన్ని పట్టుకొచ్చాడు. ఆయన ఇంజక్షన్ చేసి వెళ్ళాక నే నువ్వు 'మేలుకున్నావు" అం టుండగానే ఓ నడివయసాయన లోపలికి తొంగిచూశాడు.

"హౌ యీజ్ షి?" అన్నాడు తిలక్‌తో.

తిలక్ భార్యకు సైగ చేసి, "షి యీజ్ ఆల్ రైట్ సార్!" అన్నాడు. ఆయన చిన్నగా నవ్వి "ఓ. కే! సీ యూ!" అంటూ బయటినుంచే వెళ్ళిపోయాడు.

ఆయనే డాక్టరని లలిత గ్రహించింది.

"ఇప్పుడు టైమెంతయింది?" అన్నదామె మంచం మీదనుంచి దిగుతూ.

"పదకొండు దాటింది!"

"బాప్ రే, నాలుగ్గంటలకి పైగానే తెలివి తప్పి పోయానన్నమాట!" అంటూ మొహం కడుక్కుని వచ్చి కేరియర్ విప్పి యిద్దరికీ వడ్డించింది.

"ఇదుగో, చెప్తున్నాను! ఉదయమే రూం ఖాళీచేసి వెళ్ళిపోదాం. నాకు ఒక్క క్షణం కూడా ఇక్కడ వుండా లనిపించటంలేదు" అన్నది లలిత.

ముద్ద పాలమారినట్టు దగ్గి, "అదేమిటి? వారం రోజులకి ప్రోగ్రాం వేసింది నువ్వే! ఒక్క రోజుతో సరదా తీరిపోయిందా?" అన్నాడు.

"ఏదో ముందు తెలీక, సరదాగా గడపాలని వచ్చాం. కాని యిక్కడి వాతావరణం నాకు చాలా భయంకరంగా కనిపిస్తోంది. పైగా ఊరికి చాలా దూరంగా కొండలు చెట్లు పుట్టల మధ్య ఈ గెస్టు హౌస్ ఒక్కటి విసిరేసినట్టుంది. నాకు ఉండబుద్ధి కావటంలేదు బాబూ!"

"దూరంగా వుండబట్టే ప్రశాంతంగా హాయిగా వుంది. లేనిపోని అనుమానాలు, భయాలు పెట్టుకోకు! నాకీ స్పాట్ చాలా బాగా నచ్చింది. ప్రకృతి సౌందర్యమంతా యిక్కడే పోగుపడినట్టుంది!" అన్నాడు తిలక్.

లలిత కోపంగా, ఉక్రోషంగా చూసింది భర్తవంక.

లలిత శ్రీమంతుల బిడ్డ. ఓ విధంగా పెద్దల నెదిరించి తిలక్‌ని ప్రేమించి పెళ్ళాడింది. తిలక్ ఓ సామాన్య కుటుంబంలోనుంచి వచ్చినవాడు. చదువుకునే రోజుల్లోనే లలిత అతన్ని అభిమానించి ఆరాధించేది. తిలక్ చాలా బ్రిలియంట్! అతని తెలివితేటలే అతని ఆస్తిగా అన్నిటా ఫస్టున వచ్చి యింజనీరింగ్‌లో యూనివర్సిటీ గోల్డు మెడల్ సంపాదించాడు.

లలిత అతని చదువు పూర్తయ్యేవరకు ఓపిగ్గా కాచుకుని వున్నది. అతని గమ్యానికి అడ్డురాకుండా అతను యింజనీరుగా ఉద్యోగం సంపాదించేవరకు ఎదురుచూస్తూ కన్యగానే మిగిలిపోయింది. తండ్రి ఎంత చెప్పినా మేనబావను చేసుకోవటానికి తిరస్కరించింది.

తిలక్ ఆమెతో పెళ్ళికి మొదట్లో అంగీకరించలేదు. అంతస్తుల తారతమ్యాన్ని దృష్టిలో పెట్టుకునే అతను

తనకి దూరంగా జరుగుతున్నాడని ఆమెకు తెలుసు. అసి, అంతస్తు వదులుకుని అతన్నే చేసుకోవటానికి సిద్ధపడింది.

తిలక్ — ఆమె తనను తనసుగా గుర్తించి తనకోసం తండ్రిని, ఆస్తిని, వదులుకోవటానికి సిద్ధపడిన లలితను ఆనందంగా తనదాన్ని చేసుకున్నాడు. లలిత తండ్రికి దూరమైంది.

పెళ్ళయి మూడేళ్ళయింది. లలితకు స్త్రీ సహజమైన మాతృత్వ కోరిక తీరనేలేదు. అయినా అది వెలిగా ఆమె యెన్నడూ ఫీలవలేదు. రోజురోజుకీ భర్తమీద ఆమె ప్రేమ, ఆరాధన రెట్టింపవుతూనే వచ్చాయి. వీలున్నప్పుడల్లా పిక్నిక్కులు, విహారయాత్రలు చేయిస్తూనే వుంటుంది.

ఆ విహార యాత్రలో ఓ భాగమే హిల్స్‌మీద యీ గెస్టు హౌస్‌లో నివాసం! లలితని సంతోష పెట్టడానికి తనకి వీలున్నప్పుడల్లా భార్య వేసిన యిలాంటి చిన్నచిన్న ప్రోగ్రాంలను ఆనందంగా ఒప్పుకుని ఆమెతో అందమైన సాయంత్రాలు గడపటం తిలక్‌కి సరదా!

ఆ రోజే గెస్టు హౌస్‌కొచ్చారిద్దరు.

3

మర్నాడుదయం నిజంగానే సూట్‌కేసులు సర్దేస్తున్న భార్యని చూసి ఆశ్చర్యంగా అడిగాడు తిలక్!

"వాట్ డార్లింగ్ నిజంగానే వెళ్ళిపోవాలా?" అన్నాడు.

సర్దుతున్న లలిత అతని వంక తలెత్తి చూడకుండానే సీరియస్‌గా తన పని చేసుకుపోతోంది.

"ఇంత దూరం వచ్చాం.... కనీసం నాలుగురోజులైనా వుండి వెళ్దాము" అన్నాడు మళ్ళీ తనే.

చటుక్కున పెట్టెమూసి మూత బిగించి అతనివైపు చూసింది. అతను నవ్వేశాడు.

"నేను వెళ్ళిపోదామంటే మీరుంటాననటంలో మీ ఉద్దేశ్యమేమిటి?"

"ఇక్కడి ప్రశాంతమైన వాతావరణం, ఈ అందమైన ప్రకృతి నాకు చాలా నచ్చాయి లల్లీ!"

లలిత భర్త ముక్కు పట్టి అల్లరిగా ఆడించి, "సరే! శ్రీవారు అంతగా ముచ్చటపడుతున్నారు కాబట్టి నాలుగు రోజులకి మాత్రం అంగీకరిస్తున్నారు దేవివారు. అయితే ఓ కండిషన్!" అన్నది.

"ఏమిటది, చెప్పెయ్యి వెంటనే!"

"మీరు ఫోటోలు తీస్తానని కొండల వెంట బండల వెంట పూరేగరాదు. అసలు యీ గది వదిలి బయటికే పోకూడదు."

"అదేమిటోయ్, మరీ అంత పెద్ద శిక్ష. గదిలో వుండి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించేదెలా?"

"గదికి కిటికీలున్నాయి. ఇక్కడ్నుంచి ప్రకృతి చక్కగా కనపడుతోంది. మీ కావలసినంత సేపు చూసి ఆనందించండి."

"అబ్బే, అదెలా కుదురుతుంది? దేవిగారితో వనవిహారం చెయ్యాలి. ప్రేమ పక్షుల్లా యీ ప్రకృతి ఒడిలో పరవశించాలి!"

"మీరొక్కరు విహరించండి. నేను మాత్రం రాను. కన్ను మూసినా తెరిచినా నిన్నటి దృశ్యమే నా కళ్ళముందు మెదుల్తోంది. నా ఒళ్ళు చల్లబడిపోతోంది."

"పూర్ లల్లీ! ఏదో చూసి ఏదో అనుకుని భయపడిపోయావంతే! ఇక్కడ అలాంటి భయంకర వ్యక్తులెవరూ

లేరు. అలా అయితే యిన్ని వందలమంది రోజూ వచ్చి ఆనందించి వెళ్తారా? ఒక్కొక్కరయితే నెలల తరబడి వుండిపోతారు. మనం వేసుకున్న ఏడు రోజుల మజిలీ నాలుగు రోజులకు తగ్గిపోయింది. ఈ నాలుగు రోజులు కూడా ఏవీ చూడకపోతే ఎట్లా?"

లలిత మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ అలాగే కూచుండిపోయింది.

"హల్లో, మే ఐ కమిన్!" అంటూ డాక్టరు గుమ్మం దగ్గర నించుని నవ్వుతూ అన్నాడు.

"రండి సార్! నేనే మీ దగ్గరికొద్దామనుకుంటు న్నాను" అన్నాడు తిలక్.

డాక్టరుని చూసి లేచి నించుంది లలిత.

"మీవారు నీకోసం నిన్న రాత్రి పడ్డ ఆందోళన యింతా అంతా కాదమ్మా! నన్ను కంగారుపెట్టేసి తను కంగారుపడిపోయి ఎంత హడావిడి చేశాడనుకున్నావు?" అన్నాడాయన అదే నవ్వుతో.

లలిత సిగ్గుగా, ప్రేమగా చూసుకుంది భర్తని, తనంటే భర్తకు ప్రాణమని ఆమెకు తెలుసు. తనకైతే భర్తే ఊపిరి! ఆ సంగతి అతనికీ తెలుసు. ఆ ఆత్మీయతే ఆ మధురానుబంధమే ఆమె మనసులో కోటి కాంతులు విరజిమ్ముతుంది. తనంత అదృష్టవంతురాలు లేదని పొంగి పోతుంది.

తిలక్ డాక్టరుతో లలిత భయపడ్డ విషయం చెప్పుదా మనుకుని మళ్ళీ అంతలోనే విరమించుకున్నాడు. చిన్న విషయానికి ప్రాధాన్యతనిచ్చి లలిత మనోగత స్థితిని మరింత బలహీనపరచటమే అవుతుందని అభిప్రాయ

పడ్డాడు.

అయిదు నిమిషాలు కూచుని డాక్టరు వెళ్ళిపోయాడు.

4

"హల్లో, లలితా? వాటే సర్‌ప్రయిజ్?" అంటున్న వ్యక్తివంక విస్మయంగా చూసింది లలిత. అతనెవరో వెంటనే గుర్తురాలేదు. అతను చిన్నబుచ్చుకున్నాడు.

లలితకి గుర్తొచ్చింది. అతను మహేష్. ఆమె క్లాస్ మేటు.

"ఓ, మహేష్ నువ్వా?" అన్నదామె. "బాగా లావయ్యావు. అందుకే వెంటనే గుర్తుపట్టలేకపోయాను."

"నిన్ను గుర్తుపట్టాను. చదువుకునే రోజులకన్న చాలా అందంగా, అద్భుతంగా ఉన్నావు!" అన్నాడు మహేష్.

లలితకి అతనలా మాట్లాడటం కోపం తెప్పించింది. పక్కన తిలక్ వున్నాడు. బెరుగ్గా చూసింది భర్తవంక. అతనా విషయాన్ని పట్టించుకున్నట్టే లేదు.

"వీరు మావారు, ఇంజనీర్!" అన్నది లలిత తిలక్‌ని పరిచయం చేస్తూ.

"ఓహో, పెళ్ళిచేసుకున్నావన్నమాట!" అన్నాడు మహేష్ పొడిపొడిగా. ఒకే కాలేజిలో చదువుకున్న కారణంగా మహేష్ గుర్తున్నాడు తిలక్‌కి. ఇంటర్ వరకు కలిసే చదువుకున్నారంతా. తర్వాత తను యింజనీరింగ్ కోర్సుకి వెళ్ళిపోయాడు. ఇతను డిగ్రీ చదివి నట్టున్నాడు లలితతోబాటు.

"నేను యీ పక్కనే కాలేజిలోనే దిగాను. ఒంటరి వాణ్ని! పెళ్ళి చేసుకోవాలనిపించలేదు" మహేష్ నవ్వుతూ లలితవంక అదోలా చూశాడు.

లలితకి అతని ప్రవర్తన జుగుప్సాకరంగా వుంది.

పక్కన భర్త వుండగా అతన్ని అలా కల్సుకొన్నందుకు ఆమెకి బాగా అనిపించలేదు.

"వస్తాం!" అంటూ సంభాషణ తుంచేసి భర్తతో వెళ్ళిపోయింది లలిత.

మహేష్ వున్నచోట నే నుంచుని తమ వంక పరీక్షగా చూస్తూ వుండిపోవటం తిలక్ దృష్టినుంచి దాటిపోలేదు.

5

"ఈ రోజైనా కొండ దిగకుండా యిక్కడున్నంచే ఏవో రెండు స్నాప్స్ తీసెయ్యండి మహానుభావా!" అన్నది లలిత. తిలక్ కెమెరా పొజిషన్ చూసుకుంటున్నాడు.

లలిత ఎత్తుగా వున్న బండరాయిమీద కూచుంది. తిలక్ ఏటవాలుగా ఉన్న ప్రదేశానికి యివతలగా నించుని చూస్తున్నాడు కెమెరా లెన్స్‌లోనుంచి.

భర్త భుజాలమీదుగా వెనక్కి చూసిన లలిత ఉలిక్కిపడింది. చెమట్లు పోశాయి. సన్నగా వణుకు ప్రారంభమయింది. వెన్నున జరజర ఏదో పాకినట్టయింది.

అతను ....అతను....చింపాంజీ ముఖం, నల్లని రూపం, బవిరి గడ్డం!....సందేహంలేదు నిన్న సాయంత్రం కొండ దిగువన చూసిన వ్యక్తే! తన వంక నే పరీక్షగా చూస్తున్నాడు. నవ్వుతున్నాడు. అదే నవ్వు, గుండెల్ని పీల్చేసే నవ్వు.

లలిత కెమెరావంక చూడటంలేదని గమనించిన తిలక్ ఆమెను హెచ్చరించాడు.

లలిత మాట్లాడలేదు! బవిరిగడ్డంవాడు జేబునుండి రివాల్వర్ తీశాడు. సరిగ్గా తిలక్ కి గురిపెట్టాడు. లలిత కెవ్వున అరిచింది. చటుక్కున రాతిమీదినుంచి లేచి

భర్త దగ్గరకు పరుగెత్తింది.

"ఏమిటి లల్లీ, ఏమయింది?" తనని వాటేసుకున్న లలితను పొదివి పట్టుకున్నాడు తిలక్ — కళ్ళతోనే పక్కకు చూపించింది లలిత.

తిలక్ వెనక్కు చూశాడు.

అక్కడ ఏమీ కనిపించలేదు!

"ఏమిటి లల్లీ, ఎందుకంతగా భయపడిపోతున్నావు! ఏమయింది?" అన్నాడు ఆమె వెన్ను నిమురుతూ.

లలిత భర్త భుజాలమీదినుంచి చూసింది.

బవిరిగడ్డంవాడు లేడు! తిలక్‌ని వదిలిపెట్టి గబగబ అటు యిటు కళ్ళతో వెతికింది. అతను లేడు!

"ఏమిటి లల్లీ, ఏమిటి వెతుకుతున్నావు?"

"నిన్న చెప్పానే, చింపాంజీ ముఖంవాడు - మీకు రివాల్వర్ గురిపెట్టి మీ వెనకనే నించున్నాడింతసేపు. నేను అరిచి మీ దగ్గరకు పరుగెత్తుకు రాగానే ఎటో మాయమయిపోయాడు."

"ఏమిటి, నాకు రివాల్వర్ గురిపెట్టాడా?"

"అవునండీ! అది చూసి నా నోట మాటరాలేదు. మీకు చెప్పాలనుకున్నానుగాని ఏమిటో అంతా అయోమయమైపోయింది. అందుకే పరుగెత్తుకొచ్చి మిమ్మల్ని పట్టుకున్నాను."

"మరివాడు కాల్చలేదేం?"

"అదే నాకూ విచిత్రంగా వుంది. వాడు నిజంగా కాల్చాలనుకుంటే ఒక్క క్షణం చాలు! నేను మిమ్మల్ని అడుకునేలోపల తన పని పూర్తిచేసుండేవాడు. మరెందుకు పారిపోయాడో అర్థంకాలేదు."

తిలక్ ఆమెవంక జాలిగా చూశాడు.

"లలీ, నీ మనసెందుకు నిన్నటినుంచి పాడయింది. ఏం చూసినా, యెవర్ని చూసినా నీ మనసులో అదే భయంకరరూపం పాతుకుని పోయింది. అసలు యీ చుట్టుపక్కల మనిషన్నవాడే లేడు!"

"అయితే నాది ఉత్త భ్రమేనంటారా?" ఉక్రోషం ధ్వనించింది లలిత కంఠంలో.

తిలక్ వెంటనే మాట్లాడలేదు. లలిత కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తుడుచుకునే ప్రయత్నం చెయ్యకుండా ఎటో శూన్యంలోకి చూస్తోంది.

6

రూంకి తిరిగొచ్చేసరికి తాళంపెట్టి తిప్పే రంధ్రంలో గుచ్చి ఏదో చీటీ వుంది.

తీసి చదివాడు తిలక్.

"లలితా! రెండు సార్లు వచ్చి వెళ్ళాను. మీరింకా తిరిగి రాలేదనుకుంటాను. కాసేపు సరదాగా కబుర్లు చెప్పుకోవచ్చనుకున్న నా ఆశ నిరాశయింది. —మహేష్!" అని

వున్నది అందులో.

లలిత చీటీ చదివింది. ఆమె ముఖం కందగడ్డలా అయింది. మహేష్ అతి చొరవకు ఒళ్ళు మండుకొచ్చింది.

తిలక్ ఆ విషయాన్ని పట్టించుకున్నట్టు లేదు!

ఆమె మంచంమీద కూచోబోతూ ఎందుకో చటుక్కున కిటికీవైపు చూసింది. అంతే, ఆమె చూపులు కిటికీకే అతుక్కుపోయాయి.

అక్కడ బవిరిగడ్డంవాడు నించుని ఆమె వంకనే చూస్తున్నాడు. అదే నవ్వు.

"ఏమండీ, అదుగో వాడే!" అన్నది లలిత వెంటనే కిటికీవైపు చూపించి.

తిలక్ చటుక్కున కిటికీవైపు చూశాడు. కిటికీలో నించి చూస్తున్న మహేష్ కనిపించాడు.

"ఓ, మహేషా?" అన్నాడు తిలక్.

లలిత ఉలిక్కిపడి చూసింది. అక్కడెవరూ లేరు!

"మహేష్ అంటారేమిటి?" అన్నది మెల్లగా.

"కిటికీలో నుంచి మహేష్ చూస్తున్నాడుగా!" అన్నాడు తిలక్ కంఠంలో ఎలాంటి భావమూ ప్రకటితం కాకుండా.

"అబ్బే, మహేష్ కాదు - నేను చెప్పిన బవిరిగడ్డం వాడు కిటికీలోంచి చూస్తూ కనిపించాడు."

తిలక్ కిటికీవైపు చూశాడు. మహేష్ లేడీసారి. ఎవరూ లేరక్కడ!

"లల్లీ, నీకెందుకో బాగా భయం పట్టుకున్నది! ఎవర్ని చూసినా ఏం చూసినా నీకు ఆ భయంలో నువ్వూహించుకుంటున్న రూపమే కనిపిస్తోంది. అవునా?"

నిస్సహాయంగా చూసింది లలిత.

"అయితే మీరు నన్ను నమ్మటంలేదా?"

"నిన్ను నమ్ముతున్నాను, ఎప్పటికీ నమ్ముతాను. కాని నీ నమ్మకాలమీదే నమ్మకం కుదరటంలేదు!"

"ఏమిటో మీ మాటల గారడీ నాకర్థం కావటం లేదు. నాకంతా అయోమయంగా వుంది. పిచ్చెత్తినట్టుంది!" ఆమె తల రెండు చేతుల్లోనూ పట్టుకుని కణతలు నొక్కుకుంటోంది.

"భోంచేశారా?" అంటున్న మాటలతో యిద్దరు చటుక్కున గుమ్మంవైపు చూశారు. డాక్టరు!

"రండి సార్! ఇంకా చెయ్యలేదు. ఇప్పటివరకు బయట తిరిగొచ్చాం" అన్నాడు తిలక్.

డాక్టరు వెనక్కు వెళ్ళిపోయాడు.

"ఫరవాలేదు, రండి! అప్పుడే ఆకలి కావటంలేదు" అన్నాడు తిలక్.

డాక్టరు వచ్చి ఫేం కుర్చీలో కూచున్నాడు.

తిలక్ ఆయనతో లలిత విషయం ప్రస్తావించనా వద్దా అని ఆలోచిస్తున్నాడు. లలిత మనసులో బాధ పెట్టుకుంటుందేమోనని సంకోచిస్తున్నాడు.

"మీరు ఒక్కరే వచ్చారా సార్ హిల్స్‌కి!" అన్నాడు తిలక్ డాక్టరుతో.

"అవునండీ! నాకు వెనకముందు ఎవరూ లేరు."

"అదేమిటి సార్ .... భార్య, పిల్లలు ..."

"ఒక ఏక్సిడెంట్‌లో నా భార్య యిద్దరు పిల్లలు పోయారు. అప్పట్నుంచీ ఒంటరివాడినై పోయాను. మళ్ళీ సంసార జీవితమంటే నే విరక్తి పుట్టిపోయింది. అందుకే నేనొక్కడినే అప్పుడప్పుడు యీ హిల్స్‌కి, యింకా దేశంలోని విహారస్థలాలకి పోయి వస్తూంటాను."

"అరరె.... ఎంత పని జరిగింది?"

"విచిత్రమేమిటంటే నా భార్యా పిల్లలు పోయినది యెక్కడో కాదు - యీ హిల్స్‌మీదే!"

వింటున్న యిద్దరు ఉలిక్కిపడి చూశారు.

"ఈ హిల్స్‌మీదా? అదెలా?"

"ఓసారి ఇలాగే సరదాగా పిక్నిక్ వేసుకుని నాలుగు రోజులుండి వెళ్ళిపోతున్నాం కారులో. ఘాట్ రోడ్ మలుపు దగ్గర కారు స్లిప్ అయింది. అంతే, కిందనున్న లోయలోకి పడిపోయింది కారు. నా భార్యాబిడ్డలు

స్పాట్ లోనే పోయారు. నన్ను హాస్పిటల్లో చేర్చారు. నా కాళ్ళు రెండూ ఫ్రాక్చరయ్యాయి. ఇదిగో చూడండి!” లుంగీ మోకాళ్ళదాకా లాక్కొని చూపించాడు డాక్టరు.

ఆపరేషను గాయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

“అందుకే వారానికోసారైనా యీ హిల్స్ కి వచ్చి పోతుంటాను. ఇక్కడ తిరుగుతుంటే నా వాళ్ళు యీ పరిసరాల్లో నాతో తిరుగుతున్నట్టే అనుభూతి కలుగుతుంది! వాళ్ళ ఆత్మలు యిక్కడే సంచరిస్తూ వుండొచ్చునని నా గాఢ నమ్మకం!”

“మీరు డాక్టరై వుండి సెంటిమెంట్సు నమ్ముతారా?”

“సెంటిమెంట్సుని తీసిపారెయ్యకండి. ఆత్మకు చావు లేదు. అది మరో కొత్త శరీరాన్ని అలా వెతుక్కుంటూనే వుంటుంది. గీతలో భగవానుడేం చెప్పాడు? ఆత్మను శస్త్రం ఛేధింపలేదు, నీరు తడపలేదు, అగ్ని కాల్చలేదు-అని కదూ! ఈ సైంటిఫిక్ యుగంలో కూడా అది నిజమని రుజువయింది. ఆత్మలతో మాట్లాడే ప్రక్రియ కూడా పరిశోధనలవల్ల సంభవమని నిర్ధారణ చేశారు.”

తిలక్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. లలిత మానసిక పరివర్తనకు కారణం డాక్టరు చెప్తున్న ఆత్మ-అదే స్పిరిట్-ప్రభావం కాదుగదా! ఆ బవిరిగడ్డం వ్యక్తి యిదివరలో యీ ప్రాంతాల అకస్మాత్తుగా చనిపోయి స్పిరిటుగా తిరుగుతున్నాడేమో!

“ఏమిటి వున్నట్టుండి పరధ్యానంగా అయిపోయారు?”

“అబ్బె, మీరంటున్న సంగతులే ఆలోచిస్తున్నాను.”

“ఇంకో చిత్రం చెప్పనా? ఏదోక రాత్రి సమయంలో నేను పడుకున్న గదిలో నా భార్య కనిపించి యేవో అడుగుతుంది. నే నేదో చెప్తాను. స్పష్టత వుండదుకాని

మొత్తానికి నా భార్య తప్పనిసరిగా కనిపించితీరుతుంది!"

"కల్లోనా?"

"నో, నో! అది కల, వా స్తవం కాని ద్వంద్వప్రకృతి. నేను మెలకువలోనే వున్నట్టు అనిపిస్తుంది నాకు! కాని ఆ కాసేపు ట్రాన్స్‌లో వున్నట్టుంటాను. నా మెదడు యెవరి ఆజ్ఞలకో ధర్మె నడుస్తుంది. నేను నిద్రలో నడుస్తున్నట్టు గదిలో అటు యిటు తిరుగుతుంటాను. కాసేపటి తర్వాత యేమీ కనిపించదు. నేను పూర్తిగా మెలకువ లోకి వచ్చేస్తాను. మరి యిదంతా ఏమిటి? సెంటిమెంటని తీసిపారెయ్యమంటూరా?"

లలిత కళ్ళు పెద్దవి చేసుకుని వింటోంది.

నిజంగానే మన చుట్టూ చనిపోయినవారి ఆత్మలు తిరుగాడుతుంటాయా?....ఏమో

"సరే రాత్రి బాగా పొద్దుపోయింది. భోంచెయ్యండి" అంటూ డాక్టరు లేచాడు. లలితవంక తిరిగి "ఏమ్మా, ఖులాసాయే కదా!" అన్నాడు.

"ఖులాసానే డాక్టరుగారూ!" అన్నది.

డాక్టరు ఆమెవంక నవ్వుతూ చూసి, "మీ యిద్దరికీ ఓ శుభవార్త చెపుతాను. అయితే యిప్పుడు కాదు. నేను యిక్కడ్నుంచి తిరిగి హైదరాబాదు వెళ్ళిపోయే ముందు చెప్తాను. అంతదాకా సస్పెన్స్!" అన్నాడు.

దంపతులిద్దరు ఆశ్చర్యంగా చూశారు.

"ఏమిటి సార్ అది? ఇప్పుడే చెప్పెయ్యరాదూ!?" అన్నాడు తిలక్. అతనప్పుడే అదేమైవుంటుందా అని మెదడుకు పని చెపుతున్నాడు.

"నేనింకో రెండు రోజులుంటాను హిల్స్‌మీద!

రెండు రోజుల తర్వాత చెప్తాను! తప్పక చెప్పివెళ్తాను"
అంటూ గుడ్ నైట్ చెప్పి వెళ్ళిపోయాడు డాక్టరు.

7

కొద్దిక్షణాలు గదిలో నిశ్శబ్దం రాజ్యమేలింది.

బాయ్‌కి బిల్సు చెప్పటానికి గుమ్మందాకా వచ్చాడు తిలక్. సరిగ్గా అదే సమయంలో పక్కగదిలోని అమ్మాయి తలుపు తెరుచుకుని బయిటికొచ్చింది.

తిలక్‌ని చూడగానే "హాయ్, బావా!" అన్నది గట్టిగా అరుస్తున్నట్టు.

తిలక్ ఉలిక్కిపడి చూశాడు. తన మామయ్య కూతురు నళిని!

"ఓ నువ్వా? యేమిటిలా వచ్చావు? ఒక్కతెవే వచ్చావా, మీ ఆయనతో వచ్చావా?"

నళిని ఫక్కున నవ్వింది. తెల్లటి దానిమ్మగింజల్లాంటి పలువరస తళుక్కుమన్నది.

"మా ఆయన పిచ్చిమాలోకం! ఇలాంటి పిక్నిక్‌లన్నా జాలీ ట్రిప్స్ అన్నా అతనికి నచ్చవు. ఎంతసేపూ వ్యాపారం, డబ్బు సంపాదన-అదే లోకం! నేనొక్కతినే వచ్చాను సరదాగా నాలుగురోజులుండి పోదామని! నువ్వు ఒక్కడివే వచ్చావా?"

ఈ లోపల లలిత గుమ్మం దగ్గరకొచ్చింది.

తిలక్ వెంటనే నళినితో, "నా భార్య లలిత!" అంటూ పరిచయం చేశాడు. నళిని కళ్ళలో అసూయ స్పష్టంగా తొంగిచూసింది.

"నమస్కారమండీ! మా బావవంటి మంచి బాలుణ్ణి భర్తగా పొందగలిగిన మీరు అదృష్టవంతులు!" అన్నది నళిని నఖశిఖపర్యంతం లలితను పరీక్షగా చూస్తూ.

లలిత నవ్వి వూరుకుంది.

"కాస్త కంపెనీ యివ్వకూడదా బావా బోర్ కొట్టి చచ్చిపోతున్నాను!" అన్నది నళిని తిలక్ కళ్ళలోకి చూసి నవ్వుతూ. లలితకి ఆ నవ్వు చూస్తే ఒంటికి కారం రాసుకున్నట్టుంది.

"అదెలా? మరి యిద్దరం వున్నాం కదా!"

"నిన్నొక్కడ్ని కాదయ్యా మహానుభావా, యిద్దర్నీ కలిసే కంపెనీ యిమ్మంటున్నాను!"

తిలక్ వెర్రి నవ్వు నవ్వేసి, "ఓ, అలాగే! రేపుదయం నించి అందరం కలిసి తిరుగుదాం యీ హిల్స్ అంతా!" అన్నాడు.

"ఓ.కే! గుడ్ నైట్! నా పక్కనే మీరు దిగిన సంగతి యిప్పటిదాకా తెలీదు."

"నువ్వు మా పక్కన దిగినట్టు మాకూ యీ క్షణం దాకా తెలీదు."

"నాలుగు రోజులుంటారా?"

"ఉందామనే వచ్చాం!"

"తప్పకుండా ఉండండి, నేనూ వుంటున్నాను."

ఈలోపల బాయ్ కేరియర్‌తో వచ్చాడు.

తలుపులు మూసి బోల్టుపెట్టి ఆనక భర్తతో జగడం వేసుకుంది లలిత.

"ఏమిటీ, మీరొక్కరూ వచ్చివుంటే మీ మరదలు పిల్లకి మంచి కంపెనీ యిచ్చి వుండేవారా? యెంత ధైర్యం!" అంటూ విరుచుకు పడిపోయింది.

"ఆ, అహా, నా ఉద్దేశం అదికాదు లలీ! ఏదో తప్పించుకోవటానికి తొందర్లో ఏదో అనేశాను. ఒంటరిగా వుంటే మాత్రం పెళ్ళయిన అమ్మాయికి కంపెనీ

యిస్తారా?"

"పెళ్లి కాని అమ్మాయిలకి యిస్తున్నారా?"

"ఛ! ఛ! బొత్తిగా అపార్థం చేసేసుకుంటున్నావు లల్లీ! నా సంగతి నీకు తెలియదూ?"

"ఎందుకు తెలీదూ? ఇలాంటి వెలాపచ్చీసులాగా తిరిగే మరదలు మీకుందని నాకెప్పుడూ చెప్పలేదేం!?"

"సందర్భం రాలేదు, చెప్పలేదు, అంతే! మరేం లేదు."

"రేపట్నుంచి ఆమెగారితో యీ కొండలమీద విహారయాత్ర చేస్తారా? మీకెన్ని గుండెలు?"

"నేనొక్కడిన్నే కాదు లల్లీ! నీతో కలిసి _ ముగ్గురం తిరగొచ్చని నా అభిప్రాయం. అడిగిందని ఏదో మర్యాదకి అలా అన్నాను, మరేం లేదు."

"అంతే, మరేం లేదు!" ఛర్రని అనుకరిస్తూ ఆని పొట్టలో చూపుడు వేలుతో పొడిచింది.

"అమ్మో, యిదేమిటి?" అన్నాడు భయం నటిస్తూ తిలక్.

"జాగ్రత్త! నన్ను కాదని మరో ఆడదానివైపు కన్నెత్తిచూసినా నేనూరుకోను! మిమ్మల్ని ఏంచెయ్యను-దాన్ని పీకపిసికి చంపేస్తాను."

"అదేమిటి అన్యాయం? అదేం చేసింది."

"మీకేసి చూడటమే దాని నేరం! అదెవరైనా కానీండి, సాక్షాత్తు మీ మరదలే కానివ్వండి - నా రూలు రూలే!"

"ఇదెక్కడి రూలురా బాబూ! నువ్వు 'లా' చదవాల్సింది తప్పి జారి సైన్సు చదివావు. ఇప్పుడైనా ఫర్లేదు, ప్రయివేటుగా లా చదవొచ్చు."

"ఏమిటా వేళాకోళాలు? మీ మగాళ్ళ మనసులు

చదవటానికి 'లా'తో పనిలేదు. ఏ మాత్రం కామన్ సెన్సున్నా చాలు. అర్థం చేసుకోవచ్చు! మీరు తిన్నగా వుంటానంటేనే యిక్కడ వుండేది! లేకుంటే తెల్లవారగానే హైదరాబాద్ రిటన్ జర్నీ?"

"నన్ను ఘోరంగా అనుమానించి అవమానించకు లల్లీ! నేను గంగిగోవులాంటివాణ్ని!"

"ఆ దేమిటి కూరలో పెరుగు వేసేసుకుంటున్నారు?"

"ఆఁ, అవా, కంగారులో కూర అన్నం తినేశాననుకున్నాను, మరేం లేదు!"

లలిత పడిపడి నవ్వింది. తిలక్ శ్రుతి కలిపాడు.

8

ఉదయం స్నానాదికాలు అయాక తిలక్ అన్నాడు.

"ఈ రోజు కొండ చివరనున్న వేలీకి బస్ వెళ్తోంది. మనం కూడా వెళ్దామా?" అని.

"అబ్బ, అక్కడినుంచి కాఫీ తోటలు, లోయలు చాలా అందంగా కనిపిస్తాయట కదూ!"

"ఆఁ, అందుకే వెళ్దామా అంటున్నాను. ఇంకా యీ పక్కన రెండు మూడు కొండలున్నాయి కదూ! అవన్నీ బస్ మీదినుంచి చూడటానికి చాలా అందంగా వుంటాయట! మనం యిదే మొదటిసారి కదా యిక్కడికి రావటం! అన్నీ చూద్దాం."

"అలాగే పదండి."

"ఉండు, టిక్కెట్లు ముందుగా రిజర్వు చేసుకోవాలిట. తీసుకుని వస్తాను" తిలక్ బయటికెళ్ళాడు.

లలిత తలుపులు దగ్గరగా మూసి వచ్చి ఫేం కుర్చీలో కూచున్నది.

తలుపులు తోసుకొని లోపలికొచ్చిన వ్యక్తిని చూడ

గానే కెవ్వున అరవబోయింది.

అతని చేతిలో కత్తి వుంది. "అరిచావంటే చంపేస్తాను, జాగ్రత్త!" అన్నాడు.

అతను అన్నంత పనీ చేసేలా వున్నాడు.

"ఎవరు నువ్వు? ఎందుకు నా వెంటపడి వేధించుకు తింటున్నావు? వెళ్ళిపో!" కళ్ళు మూసుకుని అర చేతుల్లో ముఖం దాచుకుంది లలిత.

బవిరిగడ్డం మనిషి వినపడకుండా వికృతంగా నవ్వాడు.

"నీకోసమే! నీ అందాన్ని చూసి పిచ్చివాడినై వెంట పడుతున్నాను. ఒక్కసారి నువ్వు నాకు కావాలి. తర్వాత నా దారిన నేను పోతాను."

"ఛీ, పాపాత్ముడా! ఆ మాటనటానికే నీకెంత ధైర్యం? మావారు రానియ్యి, నిన్నేం చేయిస్తానో!"

"మీవారా?" అతను పడిపడి పొట్ట పట్టుకుని మరీ నవ్వాడు. "మీవారు శ్రీరామచంద్రుడనుకుంటున్నావు. గోపాలకృష్ణుడు! నువ్వెన్నో దానివో! పక్కనే ఓ అమ్మాయిని తెచ్చి పెట్టుకున్నాడు. రాత్రిళ్ళు నువ్వు నిద్రపోయాక ఆ పిల్లతోనే గడుపుతున్నాడు."

"అబద్ధం! నువ్వేదో కట్టుకథ చెప్తున్నావు. వెంటనే యిక్కడ్నించి వెళ్ళిపో! ఆయన గురించి నువ్వు కాదు గదా, ఆ భగవంతుడే దిగివచ్చి చెప్పినా నేను నమ్మను!"

"అంత అమాయకురాలివి కాబట్టే నిన్ను అంత తేలిగ్గా వంచన చెయ్యగలుగుతున్నాడు! అతని సరదాలు అతను తీర్చుకోగా లేనిది, నువ్వు నీ సరదాలు తీర్చుకో కూడదా?"

"ఛీ. నువ్వు వెంటనే పోతావా, పోవా?"

"నువ్వు నా కోరిక తీర్చావా సరే, లేకపోతే ఎంతో

అపురూపంగా చూసుకుంటున్న నీ భర్త యీ లోయల్లో శాశ్వతంగా నిద్రపోతాడు, జాగ్రత్త!" తలుపులు తెరుచుకుని చటుక్కున మాయమయ్యాడు గడ్డంవాడు.

లలిత ఒక్క పరుగున వెళ్ళి తలుపులకి బోల్టువేసి వచ్చి మంచంమీద అడ్డంగా పడిపోయింది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. భయంతో నాలుక పొడారిపోయింది!

ఎవడీ గడ్డంవాడు? ఎందుకు తనని లా వేధిస్తున్నాడో? వాడి ముఖం చూస్తే మూడురోజుల దాకా అన్నం సయించదు. తనకి వచ్చినప్పట్నుంచీ అన్నం తినాలనే అనిపించటంలేదు. వీడ్ని చూశాక మరీను!

వాడెంత దుర్మార్గుడు? అన్నం పున్నం ఎరగని తన భర్తమీద అభాండాలువేసి తన మనసు విరిచెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు! ఇలాంటి వాళ్ళు కోటిమంది కలిసి తన చెవి దగ్గర హోరెత్తించినా దైవంకన్న మిన్నగా తను కొలిచే తిలక్‌ని అనుమానించగలదా? తన బొందిలో ప్రాణముండగా అది జరగదు!

తలుపు చప్పుడైంది. "ఎవరు?" అనడిగింది గుండె చిక్కబట్టుకుని.

తిలక్ కంఠం "నేనే లల్లీ!" అని వినిపించింది.

ఆమె లేచివెళ్ళి తలుపు తీసింది.

"ఈ రోజుకి సీట్లు లేవు. రేపటికి తీసుకున్నాను" అన్నాడు తిలక్ టిక్కెట్లు ఆమెచేతికందిస్తూ.

"ఏమండీ, మనం యీ రోజే హైదరాబాదు వెళ్ళిపోదాం!" అన్నది ఆకస్మాత్తుగా లలిత.

అతను విస్తుపోయి చూసి, "అదేమిటి? నాలుగు రోజులుందామనుకున్నాం కదా! .... ఓ, నీ అనుమానం

అర్థమయింది!" అన్నాడు యేదో గుర్తొచ్చినట్టు.

"ఏమిటి?"

"అదే, మా మరదలు పక్కన దిగిందని కదూ నీ అనుమానం!"

"ఛ, ఛ. అదేం కాదండి. నాకే ఎందుకో ఇక్కడ వుండాలనిపించటంలేదు. వెళ్ళిపోదామండీ!"

"రేపు ఆ పేలీస్ చూసి వెళ్ళిపోదాంలే!"

"వద్దు, యీ రోజే వెళ్ళిపోదాం!"

తిలక్ భార్యవంక దీక్షగా చూసి, "ఇంత సడన్ గా ప్రోగ్రాం మార్చేశావేం? అయినా హైదరాబాదుపోయే బస్సు ఉదయం ఏడుగంటలకే వెళ్ళిపోతుంది. ఇప్పుడు ఎనిమిదిన్నరయింది. ఇక రేపే" అన్నాడు.

లలిత నిస్సహాయంగా చూసిందతనివంక.

"ఏమిటి లల్లీ, ఇక్కడికి వచ్చినప్పట్నించీ అదోకలా వున్నావు. సరదాగా నాలుగురోజులు ఎంజాయ్ చేద్దామని వచ్చి ఇలా నిస్సారంగా నీరసంగా అయిపోయావేమిటి?"

లలిత యిక ఆపుకోలేక ఏడ్చేసింది.

"మళ్ళీ ఆ బవిరిగడ్డంవాడు కనిపించాడండీ! ఇక్కడికొచ్చి బెదిరించాడు. మిమ్మల్ని చంపుతానని కూడా ఏదేదో వాగిపోయాడు!"

తిలక్ విస్తుపోయి చూశాడు.

తను యిన్నిసార్లు బయట తిరిగివస్తున్నాడు. కాని ఒక్కసారికూడా లలిత చెప్పినటువంటి వ్యక్తులుగాని, కనీసం గూండాల లిస్టులోకి వచ్చే లక్షణాలున్నవాళ్ళుగాని ఎక్కడా తారసపడలేదు. మరి లలితకు మాత్రమే కనిపించటమేమిటి? లలితకు డాక్టరు చెప్పినటువంటి స్పిరిట్ ఏదైనా....తన ఆలోచనకి తనే ఉలిక్కిపడ్డాడు.

నో, అలాంటిదేం కాదు. లలిత మరీ అంత చిన్నపిల్ల కాదు - అలాంటి స్పిరిట్ చిన్నవాళ్ళని, బలహీన మన స్తత్వం వున్నవాళ్ళని తేలిగ్గా ఆవహిస్తాయంటారు. లలిత బలహీనురాలు కూడా కాదు!

"సరే, ఉదయమే వెళ్ళిపోదాం!" అన్నాడు ఓ నిర్ణయానికి వచ్చినట్టు. లలిత ముఖంలో కళ వచ్చింది.

"ఈ సాయంత్రం బయట యెక్కడా తిరగొద్దు. ఉదయం తెల్లవార్తూనే యిట్నుంచి యిటే రూంనించి వెళ్ళిపోదాం" అన్నదామె. తిలక్ తలూపాడు.

9

గుమ్మం దగ్గర యేదో అలికిడి వినిపించింది. తిలక్ చప్పుడు చెయ్యకుండా తలుపు బోల్టుతీసి, భళ్ళున తలుపులు తెరిచాడు.

అప్పటిదాకా తలుపులకి చెవి ఆనించుని వింటున్న వ్యక్తి తెల్లబోయి చేష్టలుడిగి అలాగే వుండిపోయాడు.

అతను మహేష్!

"అరె, నేను తలుపు తట్టబోతుండగా మీరే తెరిచారే! హల్లో లలితా హౌ ఆర్యూ?" అంటూ స్వతంత్రంగా గదిలోపలికి వచ్చేశాడు మహేష్.

తిలక్ అతనివంకే పరీక్షగా చూస్తున్నాడు. మరీ సంస్కారహీనంగా ప్రవర్తించే అలాంటి వ్యక్తులపట్ల ఏ మాత్రం సదభిప్రాయం లేదతనికి!

లలిత మొహం చిట్లించింది.

"సారీ లలితా, మిమ్మల్ని మంచి మూడ్‌లో చెడ గొట్టి వుంటాను!" వెకిలిగా నవ్వాడతను.

"ఏమిటి, నాతో నువ్వు మాట్లాడవలసినది? మేమున్నపుడు వస్తే సరిపోతుందిగా, చీటీలు పెట్టిపోవటందేని

అంత అర్జంటు పనులేమున్నాయి మాతో?" చిరాగ్గా చూస్తూ అన్నది లలిత.

తిలక్ గది బయటకు వెళ్ళబోతుంటే "ఏమండీ, మిమ్మల్నే" అంటూ వెనక్కి పిలిచింది.

తిలక్ వెనుతిరిగి ప్రశ్నార్థకంగా చూశాడు.

"మనం వేలీ దగ్గరకు నడిచి వెళ్దామన్నారు కదా, వుండండి నేనూ వస్తున్నాను" అంటూ చకచక లేచి తల సర్దుకుని టేబిల్ మీదున్న రూం కీ అందుకుంది.

"ఇదేమిటి, అతిధిని సత్కరించకుండా కనీసం నేననే వాడ్ని యిక్కడున్నానన్న సంగతే మరిచి మీరిద్దరు బయటకి వెళ్ళిపోవటం అన్యాయం, అక్రమం!" అన్నాడు మహేష్ మొహం మాడ్చుకుని.

"సారీ, మళ్ళీ ఎండెక్కిపోతే కష్టం. తీరిగ్గా కబుర్లు చెప్పుకునేటంత వ్యవధి లేదు!" అంటూ గది బయటికి వచ్చేసింది లలిత.

విసురుగా లేచి బయటికి వెళ్ళిపోయాడు మహేష్.

గదికి తాళం పెట్టి రోడ్ మీదికొచ్చాక, "అదేమిటి సడన్‌గా ఈ వేలీకి ప్రోగ్రాం పెట్టేశావేమిటి? అసలు బయటికే వెళ్ళొద్దన్నావు!?" అన్నాడు తిలక్ నవ్వుతూ భార్యవంక చూసి.

"లేకపోతే, జిడ్డులా వదలటంలేదా మనిషి! కనీసం సంస్కారమైనా లేని అలాంటి రోగ్‌తో మనకి కబు ర్లేమిటి?" అన్నదామె.

"మనం ఏం మాట్లాడుకుంటున్నదీ తలుపు అవతల నిలబడి వింటున్నాడు! అందుకే అనుమానం వచ్చి తలుపు తీశాను. దొరికిపోయాడు."

"వాడిదివరలో కాలేజిలో ఒకటి రెండుసార్లు నన్ను

అల్లరి పెట్టబోయాడు. ఓసారి చెప్పుతో కొట్టాను."

"తర్వాత మళ్ళీ నీవెంట పడలేదా?"

"నన్ను చూస్తేనే అమడదూరం పారిపోయేవాడు!"

"మరిప్పుడు ఏ మొహం పెట్టుకుని పలకరిస్తున్నాడు?"

"మీ ముందు తనకి నాతో ఎంతో పరిచయమున్నట్టు క్రియేట్ చేయటానికి తంటాలు పడుతున్నాడు!"

"గమనించాను. మరొకరైతే యిలాంటివాడి చర్యలకు భార్యని కూడా అనుమానించటానికి వెనుదియ్యడు. అలా వుంది వాడి ప్రవర్తన."

"అవును, అదే వాడి దురాశ కూడా!"

"శీవిట్! ఎక్కడికి పోదాం?" అన్నాడు తిలక్.

"వాడినుంచి తప్పించుకోవటానికి సమయానుకూలంగా అలా అనేశాను. రూంకి వెళ్ళిపోదామా?"

"పదకొండు కావచ్చింది. ఓ గంట అలా అలా తిరిగి కాంటీన్‌లోనే భోంచేసి రూంకి పోదాం! చివరిగా ఓసారి యీ లోయల్ని, కొండల్ని, ప్రకృతి అందాల్ని చూసిపోదాం!" తిలక్ భావుకుడు. అతనికి ప్రకృతిపట్ల ఎంత అభిమానమో ఆమెకు తెలుసు. అందుకే వారించలేకపోయింది.

"అటు పోవద్దు. అసలు అక్కడే ఆ చింపాంజీగాడు మొదటిసారిగా నాకు కనిపించాడు. ఇటు వెళ్దాం. ఈ వైపు యిప్పటిదాకా పోలేదు కూడా" అన్నది లలిత.

ఆమె అనుక్షణం ఆ వ్యక్తి గురించే ఆలోచిస్తోంది. ఆమె అబద్ధం చెప్పటంలేదు. నిజంగానే అలాంటి వ్యక్తిని చూసి వుంటుంది. అయితే వాడు తను లేనప్పుడు, తన దృష్టి పడనప్పుడు ఆమెకు కనిపిస్తున్నాడు. భయపెడుతున్నాడు. ఎందుకు?

"హలో, ఎందాకా?" అన్న పిలుపు వినిపించి ఇద్దరు త్రుళ్ళిపడి చూశారు.

డాక్టరు నవ్వుతూ వాళ్ళవంకే చూస్తున్నాడు. బండరాయిమీద కూచుని వున్నాడు. అక్కడినుంచి లోయ అందాలు చూపరుల దృష్టి మరల్చనీయవిధంగా కన్పిస్తున్నాయి.

"ఊరికే అలా బయలేరాం! మీరింకా ఎన్నాళ్ళుంటున్నారు?" అడిగాడు తిలక్.

"ఇంకా రెండు రోజులు."

"మేము రేపుదయం వెళ్ళిపోతున్నాం."

"అరె, నాలుగు రోజులపాటు వుంటానన్నారుకదా!"

"లలితకు ఒంట్లో బావుండటంలేదు సార్!"

"సరే, అలాగే వుంటుంది. ఇలాంటి చోటనే ప్రశాంతత రిలీఫ్ దొరుకుతాయామెకు."

డాక్టరు మాటలు తిలక్‌కు యేం అర్థంకాక ఆయన వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఓ, శుభవార్త చెపుతానన్నానుకదా, చెప్పెయ్యనా?"

"చెప్పండి. ఇంకా సస్పెన్సులోనే వుంచాలా?"

"మీరిద్దరు అమ్మా నాన్నా కాబోతున్నారు."

"డాక్టర్! నిజంగానా?" తిలక్ కళ్ళలో యెన్నో జ్యోతుల వెలుగు!

తిలక్ చూపుల్నుంచి లలిత చూపులు తప్పించుకుంది.

"అమ్మ దొంగా, యింత నాటకమాడతావా? నాకు చెప్పకుండా దాస్తావా?" గుసగుసగా అన్నాడు తిలక్.

మురిపెంగా చూసిందామె భర్తవంక.

"థాంక్యూ వెరీమచ్ డాక్టర్!" అన్నాడు తిలక్.

"ఇక పోదామా?" అన్నది లలిత తిలక్‌కి మాత్రమే వినిపించేలాగా.

"అదేమిటి? కాసేపు కూచుందామన్నావు కదా, అబ్బబ్బ, నీ మనసు బొత్తిగా స్థిరత్వం కోలుపోతోంది."

"మీరిక్కడ యీయనతో సోది కొడతెడితే నేను గోళ్ళు గిల్లుకుంటూ కూచోవాలా?"

"సరే, పద!" అని డాక్టరువైపు తిరిగి "వెళ్ళొస్తాం డాక్టరుగారూ, ఎండ బాగా హెచ్చుగా వుంది!" అన్నాడు తిలక్.

"వెళ్ళిరండి. నేనిక్కడే సాయంత్రందాకా కూచుంటాను బాగా పొద్దుపోయి వస్తాను. తర్వాత కలుద్దాం, ఓ.కే!...."

10

ఎవరో తలుపు తట్టడంతో ఇద్దరు ఉలిక్కిపడి గుమ్మం వైపు చూశారు.

లలితకైతే ముందే భయం. మర్నాడు ఎప్పుడు తెల్లారుందా ఎప్పుడు హైదరాబాదు పోదామా అని ఆత్రుతగా వుందామెకు. అప్పుడు రాత్రి ఎనిమిది గంటలు దాటింది.

తిలక్ తలుపు తీయటానికి వెళ్తుంటే, "జాగ్రత్త! యెవరో కనుక్కొని మరీ తియ్యండి!" అన్నది వెనుక నుంచి.

తిలక్ "ఎవరు?" అన్నాడు, తలుపు దగ్గర నిల్చుని.

"డాక్టరుగారి నుంచి కబురు తెచ్చాను. ఇక్కడ పనిచేసే బోయ్‌ని!" అన్నాడు బయటి వ్యక్తి.

తిలక్ తలుపులు తెరిచాడు.

ఎదురుగా ఓ యిరవయ్యేళ్ళ యువకుడు నిల్చుని వున్నాడు. "తిలక్ గారంటే మీరేనా?" అన్నాడు.

"అవును, నేనే, ఏం కావాలి? కబురంటూ వేమిటి?"

"డాక్టరుగారు కొండమీదనుంచి పక్కనున్న లోయలోకి పడిపోయారు సార్! బాగా దెబ్బలు తగిలాయి. మీతో యేదో విషయం చెప్పాలని, అర్జంటుగా తీసుకు రమ్మని చెప్పారు!"

"ఎక్కడున్నారు?"

"ఆయన పడిపోయిన చోటికి దగ్గర్లో వున్న ఓ కాటేజిలో పడుకోబెట్టాం సార్."

"ఏమైనా ప్రమాదంగా వుందా?"

"చాలా ప్రమాదంగా వుంది సార్! మా గెస్టుహౌస్ డాక్టరుగారు ట్రీట్‌మెంటిస్తున్నారు."

"సరే, పద!" అంటూ తిలక్ లలితవంక చూసి "నువ్వు తలుపులు వేసుకో! నేనిప్పుడే వచ్చేస్తాను" అన్నాడు.

"నేనూ వస్తానండీ, ఒక్కతెనూ వుండలేను!"

"బాగా చలిగా వుంది. పైగా ఆయన చావుబతుకుల మధ్య వున్నాడు. నువ్వు అలాంటి చోటికి రావటం మంచిదికాదు! షాక్ అవుతావు" అన్నాడు తిలక్.

"రండి సార్! అక్కడ ఆయన పరిస్థితి క్షణక్షణం ప్రమాదంగా వుంది" బోయ్ తొందర చేశాడు.

తిలక్ అతనితో బయటికి నడిచాడు.

లలిత వెంటనే తలుపులు వేసుకోబోతూ రోడ్ మీదికి చూసింది. కాటేజిలన్నిటినీ కలుపుతూ చిన్న చిన్న తారు రోడ్డులున్నాయి కొండమీద. కుడిపక్కనున్న రోడ్ నుంచి వస్తున్న వ్యక్తిని వెంటనే గుర్తుపట్టింది.

అతను మహేష్! భగవాన్, యింత రాత్రప్పుడు యెందుకు వస్తున్నట్టు? తన దగ్గరకే అయివుంటుంది. చటుక్కున తలుపులు వేసేసి లోనికొచ్చి మంచంమీద అనిమిత్తంగా కూచుంది.

యే క్షణంలోనైనా తలుపు చప్పుడు కావచ్చునని ఊపిరి బిగబట్టి చెవులు రిక్కించి వింటున్నది. పదినిమిషా లైనా తలుపు చప్పుడు కాలేదు!

బయటనించుని యేంచేస్తున్నాడు మహేష్!

ఆమెలో ఉత్కంఠ హెచ్చింది. కాని తలుపు తియ్యటానికి ధైర్యం చాలటంలేదు.

తిలక్ యింకా రాలేదు. ఆమెలో పిరికితనం ప్రవేశించింది. ఈ రాత్రప్పుడు ఆ కొండ చివరనున్న కాటేజికి వెళ్ళిన భర్తమీద విసుక్కుంది. మళ్ళీ అంతలోనే తనని తను నిందించుకుంది. డాక్టరు చావు బతుకుల్లో వుండి కబురు పెడితే వెళ్ళాడుగాని లేకుంటే తనని వదిలి తిలక్ వెళ్ళడు!

ఆమె నిమిత్తంగా కూచోలేక లేచి కాసేపు పచార్లు చేసింది. భర్త యింకా రాలేదు.

టైం తొమ్మిదిగంటలు అయింది.

ఇక ఎంతోసేపు అలాగే వుండలేకపోయింది. తిలక్ వస్తున్నాడేమోనని చూడాలనుకుంది.

రెండుసార్లు తలుపుదాక వెళ్ళి తియ్యబోతూ సంకోచించి వెనక్కి వచ్చేసింది.

ఏమో, యింకా మహేష్ గుమ్మం దగ్గరే కాచుకుని వున్నాడేమో! అయినా, అతను యిక్కడికే వచ్చాడో కోడిన యెటయినా పోతున్నాడో! అంతా తన అనుమానం!

ధైర్యంగా తలుపు తీసింది. కాటేజీల్లో లైట్లు ప్రకాశ వంతంగా వెలుగుతున్నాయి. రోడ్ స్పష్టంగా కనిపిస్తోంది.

కాని తిలక్ వస్తూన్న జాడలేదు. తలుపులు మూసెయ్య బోతూ ఆగింది. పక్కన యెక్కడో మహేష్ మాట వినిపించింది. ఆమె ఉలిక్కిపడి చూసింది. ఆ మాటలు తమ పక్క కాటేజినుంచని గ్రహించటానికెంతో సేపు పట్టలేదు.

"....నేను నిన్ను ఎందుకు చేరదీశానో తెలుసు కదా! ఇప్పటిదాకా బావని నావైపు తిప్పుకోలేకపోయాను. నువ్వు ప్లాన్ వేశానని ఉత్తుత్తి కబుర్లు చెప్పి పబ్బం గడుపుకుంటున్నావు!" అది తిలక్ మరదలు నళిని గొంతు.

విస్తుపోయి వింటూ నిల్చుండిపోయింది లలిత.

మహేష్ గొంతువిని మరింతగా నిర్ఘాంతపోయింది.

"నేను వేసిన ప్లాన్ సామాన్యమైనది కాదు! తిలక్‌ని లలితనుండి విడదియ్యాలంటే అతనికి ముందు లలితమీద అనుమానం రావాలి! నేను ఒకటొకటిగా నా ప్లాన్‌లోని అంశాలు అమల్లో పెడుతున్నాను. రేపు అతను చూస్తూండ గానే ఆమెని పట్టుకుని నా మీదికి లాక్కుంటాను. దాంతో అతను పిచ్చెత్తిపోయి అర్జంటుగా ఆమెను వదిలించుకోపోతే అడుగు. ఆ తర్వాత నువ్వు వల విసిరి అతన్ని వశపర్చుకో, ఓ.కే!"

లలిత పిడికిళ్ళు కోపంతోను, ఉద్రేకంతోను బిగుసు కున్నాయి.

నళిని మాటలు వినిపించాయి. "ఆఁ, అంత తేలికగా ఆమెను వదులుకోడు. వాళ్ళిద్దరు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. ఆమె అంటే బావకు పిచ్చి ప్రేమ!"

"సరే, యింకో మాష్టర్ ప్లాన్ వేశాను. అది చివరి అస్త్రం! లలితను పాడుచేసేసి...."

"గుడ్! ఇప్పుడు బావుంది...."

లలిత ఒక్క అంగలో లోపలికొచ్చేసి తలుపుకి బోల్టు పెట్టేసింది. కాసేపటివరకు ఆమెకు గుండె దడ తగ్గనే లేదు!

భగవాన్, ఈ లోకం ఎంత చెడ్డది! భార్యాభర్తలు అన్యోన్యంగా జీవించటం యీ సమాజానికి కన్నెర్రగా వుంటుందేమో! తామేం తప్పుచేశామని తమిద్దరిమీదా వీళ్ళందరూ కక్ష కట్టారు? తిలక్‌ని వశపర్చుకోవాలని, అతని పెళ్ళయిన మరదలు తాపత్రయపడుతోంది. అందుకు లంచంగా తన స్త్రీత్వాన్ని మరో మగాడికి అర్పిస్తోంది! ఆమె ఒళ్ళు జుగుప్సతో జలదరించింది ఆ సంగతి తలుచుకోగానే.

ముందుగానే వాళ్ళ దురూహ తెలియటం తన అదృష్టం! ఎలాగూ రేపుదయమే వెళ్ళిపోతున్నారు కదా, వీళ్ళందరి బెడదా తీరిపోతుంది. డాక్టరుకి తప్ప రేపు దయం తాము వెళ్ళిపోతున్న విషయం ఎవరికీ తెలియదు!

లలితకు టెన్షన్‌తో తలబాధ పగలేస్తోంది. తిలక్ యింకా తిరిగిరాలేదు. డాక్టరు యెలా వున్నాడో.... బతికాడో లేక....

11

పదిన్నరయింది. తిలక్ రాలేదు. ఆమె మనసు కీడును శంకిస్తోంది. అతను వెళ్ళి యిప్పటికి రెండు గంటలు దాటింది.

ఆమెకు అకస్మాత్తుగా గుర్తొచ్చింది — తిలక్ కోసం వచ్చిన యువకుడు యిక్కడ బోయ్‌లాలేడు! అతన్ని ఈ

కాలేజెస్‌లో యెక్కడా చూసిన గుర్తు కూడా లేదు. గెస్టు హౌస్ బోయ్స్ ప్రత్యేకమైన తెల్ల షర్టు, ఆకు పచ్చ నిక్కర్లు వేసుకుంటారు. షర్టుకి గెస్టు హౌస్ పేరు ఆకుపచ్చ దారంతో కుట్టి వుంటుంది—పొడి యింగ్లీషు అక్షరాలు!

ఆ యువకుడు యూనిఫాంలో లేడు సరికదా, మంచి పోలిష్టర్ షర్టు పేంటు వేసుకుని వున్నాడు.

కొంపతీసి.... యేదయినా మోసం జరగలేదు కదా! ఆమె గుండె ఓ క్షణం ఆగి కొట్టుకుంది.

భగవాన్, యేమిటీ పరీక్ష? ఆయన క్షేమంగా తొందరగా తిరిగొచ్చేలా చూడు—అనుకున్నది పదోసారి.

రోడ్డువైపు వున్న కిటికీ తలుపులు తెరిచి చూసింది.

రోడ్ నిర్మానుష్యంగా వుంది. కాలేజీల్లో లైట్లు ఆర్పేయటంతో అంతటా చీకటి అలుముకుని వున్నది! వాచీ పదిగంటలు చూపిస్తోంది!

కిటికీ తలుపులు మూసి మళ్ళీ వచ్చి కూచుంది, లేచింది, అటు యిటు తిరిగింది. ఆమెకు దుఃఖం తన్నుకుని వచ్చేస్తోంది! పోనీ పక్కవాళ్ళ నెవరినైనా లేపుదామంటే—తనకు కుడిపక్క కాలేజిలో నళిని! యెడమ పక్క దాంట్లో డాక్టరు - ఆయన యెటూ కాలేజిలో లేడు. నళినిని పిలవటమంటే కోరి కొరివితో తల గోక్కోవటమే!

సరిగ్గా అదే క్షణంలో తలుపుమీద చప్పుడయింది. లలిత గుండె ఒక్కక్షణం లయితప్పి కొట్టుకుంది.

"ఎవరు?" అన్నది గొంతు పెకల్చుకుని.

"నేను లల్లీ....!" తిలక్ గొంతు వినిపించింది. కిటికీ దగ్గరకు వెళ్ళి తలుపు తెరవబోయిన లలిత భర్త కంఠం

వినగానే ఉత్సాహంగా గుమ్మం దగ్గరకు పరుగెత్తి తలుపు తెరిచింది.

గుమ్మంలోని వ్యక్తిని చూస్తూనే ఆమె కెవ్వున కేక వేయబోయింది. అతను చటుక్కున ఆమెని పట్టుకుని నోరు నొక్కేశాడు.

లలితకి పిచ్చిధైర్యం వచ్చేసింది. అతనితో పెనుగులాడింది. గింజుకుంది. చేతుల్తో మోదింది.

అతను వినపడకుండా నవ్వుతున్నాడు. దుబ్బుగా పెరిగిపోయిన గడ్డం, నల్లటి పాంటు, ఎర్రటి కనుగుడ్లు- ఆ చింపాంజీలాంటి మనిషిని అంత దగ్గర్లో, పైగా అతని చేతుల్లోపడి-చూడటం ఆమె శక్యం కాలేదు.

గట్టిగా కళ్ళు మూసుకుంది.

అతనామెను గాలిలో లేపి పట్టుకున్నాడు.

అంతవరకే గుర్తుందామెకు!

12

చటుక్కున తెలివి తెచ్చుకుని చుట్టూ చూసింది. అది కూడా కాటేజిలోని గదినే పోలివుంది! ఆ కొండమీది గెస్టు హౌస్‌కి సంబంధించిన కాటేజేనని తెలిగ్గానే గుర్తుపట్టింది లలిత!

బెడ్ లైటు వెలుతురు డిమ్‌గా వుంది!

ఆ గుడ్డి వెలుతురులోనే అక్కడి పరిసితిని గమనించింది. గదిలో యెవరూ లేరు! ఆ బవిరిగడ్డం చింపాంజీ తనని ఎత్తిపట్టుకున్నాడు....తర్వాత యేమయింది?

తనవంక ఓసారి పరీక్షగా చూసుకుంది. అనుమానాస్పదమైన అవాంఛనీయ సంఘటన ఏదీ జరగలేదని తెలుస్తూనే వుంది! మరి ఆ చింపాంజీ యేమయ్యాడు? ఇది యెవరి గది? ఇక్కడికి తీసుకొచ్చి యెక్కడికి

పోయాడు?

ఆమె మంచం దిగింది. అటు యిటు పరీక్షగా చూసింది. గదికాక ఎటాచ్‌డ్ బాత్, లావెట్రీ, పక్కనే చిన్న వరండా.... అంతా తమ కాటేజిలాగానే వున్నది! ఇది ఆ చింపాంజీ గదా? ఏమో, తెలీదు!

చకచక గుమ్మం దగ్గరికి నడిచింది. తలుపులు వేసుకుని బయటికి పారిపోవాలి!

బోల్టుమీద చెయ్యివేసింది.

"ఆగక్కడే!" కర్కశంగా వినిపించిన స్వరం విని చటుక్కున ఆగిపోయింది.

తను అంతవరకు గమనించనేలేదు. వరండాలోనుంచి వస్తున్నాడతను!

చింపాంజీగాడు కాదు. పరీక్షగా చూసి తృళ్ళిపడింది. "బావా! నువ్వా?" అన్నది విస్తుపోతూ.

"అవును, నేనే!" కర్కశంగా నవ్వాడు లలిత మేనబావ సోమశేఖర్.

"నన్నిక్కడికి తీసుకొచ్చిన గడ్డం మనిషి...."

"వాడ్ని నేనే కాంట్రాక్టుకు తీసుకున్నాను. నీ మొంగుడ్ని తీసుకెళ్ళిన వడ్రాడినీ నేనే నియోగించాను. చాలా, ఇంకా వివరాలు కావాలా?"

"అయితే డాక్టరుకి ప్రమాదం జరగటం, ప్రాణాపాయంలో వుండటం...."

"అదంతా నేనాడించిన నాటకం! నా మనిషి మీ దగ్గరకొచ్చిన సమయంలో డాక్టరు హాయిగా కేంటీన్‌లో భోజనం చేస్తున్నాడు!"

"అయితే మావారు...."

"ప్రస్తుతానికి క్షేమంగానే ఉన్నాడు. నువ్వు

మొండికేసే నిర్దాక్షిణ్యంగా మా చేతుల్లో చస్తారు."

"ఛీ, ఇంత దుర్మార్గాని కొడిగడతావా? నేను నీకు దక్కలేదని, నిన్ను చేసుకోవటానికి తిరస్కరించాననీ కక్ష తీర్చుకోదలిచావా?"

"మూడేళ్ళ తర్వాత ఇప్పుడెందుకు తీర్చుకుంటాను కక్ష? తీర్చుకోవాలంటే నీ పెళ్ళికిముందే తీర్చుకునే వాడిని!"

"ఈ పాడు శరీరంకోసమా ఇంత పాపానికి సిద్ధమయ్యావు! ఈ లోకం కుళ్ళిపోయింది! ఆడది ఆట వస్తువుగా భావించి ఆడుకునే శిఖండిగాళ్ళతో నిండి పోయింది."

"ఛ, నేను నిన్ను కోరి యిక్కడికి తెప్పించానను కుంటున్నావా? కుక్క ముట్టిన విస్తట్లో భోంచేసేటంత దిగజారిపోలేదు నేను!"

"బావా!" అరిచింది లలిత.

"అరవకు! పాయింట్ కొస్తున్నాను. ముందుగా ఓ దుర్వార్త. మీ నాన్న చచ్చిపోయాడు."

లలిత నిర్ఘాంతపోయి చూసింది. "ఎప్పుడు? నాన్నకి ఏ జబ్బూ లేదు. నన్నేడిపించటానికంటున్నావా?" అన్నది. ఆమె కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

"నీతో హాస్యాలాడటానికి, సరసాలాడటానికి నిన్ను రప్పించలేదు! ఇదిగో, యీ కాగితాలమీద సంతకం చెయ్యి!" దస్తావేజుల్ని ఆమెముందు పెట్టాడు.

"ఏమిటివి?"

"తెలియటంలేదా? వీలునామా. నీ ఆస్తి అంతా నా పేరున దాఖలు పరుస్తూ రాసిన శుభలేఖ. నీ సంతకం పడితేనేగాని దీనికి విలువలేదు, పెట్టు!"

"ఏమిటీ డొంక తిరుగుడు? నాకు ఆస్తి ఎక్కడిది?"

"మీ నాన్న నీ పేర్న ఆస్తంతా రాసేశాడు."

"ఆయన నన్ను యేనాడో వదిలేసుకున్నారు. ఆయన బతికుండగా గడప తొక్కనివ్వనన్నారు! నాకు ఆస్తిలో చిల్లి గవ్వకూడా యిచ్చేదిలేదన్నారు. అన్నిటికీ సిద్ధపడే తెలిసే చేసుకున్నాను."

"బతికుండగా గడప తొక్కొద్దన్నాడు కదా! ఇప్పుడు బతికిలేడు గదా, అంచేత ఆస్తి నిన్ను వెతుక్కుంటూ వచ్చింది."

తండ్రి పోయాడన్న నిజాన్ని ఆమె అంగీకరించలేక పోతోంది. ఆయన పిడుగులాంటి మనిషి! యెప్పుడూ చిరున చీది ఎరగడు! జ్వరం పడటం మొదలే లేదు! అలాంటి వ్యక్తి ఇంత అకస్మాత్తుగా ఎలా చనిపోతాడు? పైగా ఆస్తి తన పేర రాయటమేమిటి? ఇదంతా నిజమా? లేకుంటే యీ బావ అనబడే మనిషి తన సంతకం ఎందుకు కడుగుతాడు?

"నాన్నగారు చనిపోలేదు. నువ్వబద్ధం చెపుతున్నావు."

"నేనూ అలాగే అనుకున్నాను మొదట్లో! కాని నా మనుషులు తూట్లుకింద పాడిచేశారు పాపం, మీ నాన్నని. ఎంతోసేపు శవాన్ని చూడలేకపోయాననుకో!" అతను నవ్వుతున్నాడు.

లలితకు యీసారి నమ్మకం కుదిరింది. బావ నిష్కారణంగా తన తండ్రిని హత్య చేయించాడు ఆస్తికోసం!

ఆమెకు దుఃఖం కట్టలు తెంచుకుంది. కరువు తీరేవరకు తండ్రిని తలుచుకుని ఏడ్చింది. కాసేపటికి తేరుకుని బావ వంక చూసింది.

"ఆస్తికోసం ఇంత ఘోరం చేస్తావా? అసలు ఆయన ఆస్తి నా పేర యెందుకు రాశాడు? అలా రాసే తన ప్రాణంమీదికి తెచ్చుకున్నాడు...." ఆమె కంఠం మళ్ళీ రుద్ధమయింది.

"ఆస్తి నీ పేర రాశాడని తెలిస్తే మామయ్యచేత నే తిరగరాయించుకునేవాడిని. నువ్వు తప్పితే ఆయనకు నా అన్నవాళ్ళు లేరు! నువ్వు కూడా లేకపోతే ఆ ఆస్తి నాకే దక్కుతుంది — వారసుడ్ని నేనే! కాని ఆస్తి నీ పేర రాసిపోయాడు మామయ్య! ఆ సంగతి ఆయన చచ్చాక తెలిసింది, అప్పటికే అంతా అయిపోయింది!"

"ఇంతకీ మా వారినేం చేశావు?"

"క్షేమంగానే వున్నాడని చెప్పాను కదా."

"ఏమో? ఆయనకేమీ అపకారం చెయ్యననీ, చెయ్యలేదని యేమిటి నమ్మకం?"

"నీ మొగుడు మా గడ్డపోడి రక్షణలో ఇప్పటిదాకా హాయిగా వున్నాడు."

"ఆయన్ని ఎందుకు మాయం చేశావు?"

"నువ్వు ఒంటరిగా దొరకాలి కదా?"

"ఆయన్ని మోసంచేసి తీసుకెళ్ళాక నేను ఒంటరిగానే వున్నాను కదా! అక్కడే యీ బాగోతం ఆడక పోయావా? ఆ గడ్డపోడిచేత యిక్కడికి రప్పించటం దేనికి?"

"దేనికైనా స్థానబలం కావాలి కదా! నిన్ను మీ రూంలో వుంచి అడిగితే నా మాట వింటావా? అరిచి అందర్నీ పిలుస్తావు. కథ రసాభాసవదూ?"

"అయితే అన్ని సంగతులూ బాగానే సేకరించావన్న మాట!"

"మరి అసామాషీగా వ్యవహరిస్తా ననుకున్నావా? అందులోనూ యిలాంటి విషయాల్లో....ఆс, కులాసాగా కబుర్లాడటానికాక్కాదని చెప్పావుగదా నిన్ను రప్పించింది! ఇదుగో కలం, సంతకం చెయ్యి!"

"చెయ్యకపోతే....?"

"నువ్విలా మొండికేస్తావని తెలిసే నీ ప్రాణంలో ప్రాణం, నీ సర్వస్వం, నీ లోకం నువ్వే తనూ అయిన నీ పతి దేవుడ్ని మా గుప్పెట్లో పెట్టుకున్నాం....నువ్వు సంతకం చెయ్యకపోతే నీచేత సంతకం ఎలా చేయించాలో మాకు తెలుసు! అక్కడ నీ మొగుడికి పై లోకంలో సీటు రిజర్వ్ చేసేస్తాం — ఇక్కడ నీచేత సంతకమూ చేయిస్తాం. సంతకం బుద్ధిగా చేసేసి నీ దేవుడ్ని కాపాడుకో!"

"సరే, ఆయన్ని ముందు క్షేమంగా నాకప్పగించు!"

"నా మాట మీద నమ్మకంలేదా?"

"ఎలా వుంటుంది? ఆస్తికోసం స్వంత మరదల్ని ఇలా హింసించి, చివరికి ఆమె అయిదోతనాన్ని కూడా చెరిపెయ్యాలనుకునే నిన్నెలా నమ్మేది? నీకు ఉచ్చం, నీచం వుంటే నా మీదికి ఆ చింపాంజీగాడ్ని ప్రయోగిస్తావా?"

"ఓ, అదా! వాడ్ని అసలు నిన్ను తీసుకురమ్మని మాత్రమే పంపాను. అయితే సమయం చిక్కక వాడు నీ వెంట వెంటపడి నిన్ను బెదరగొట్టేశాడు. వెధవ, నీ అసలు సంగతి ఒదిలేసి నీమీద మనసుపడి ఏవో వాగాడట. తర్వాత తిట్టి పంపించానులే. అందుకే ఈ రాత్రి నిన్నేమీ చెయ్యకుండా బుద్ధిగా, యిక్కడికి జాగ్రత్తగా తెచ్చి అప్పగించాడు!"

లలిత మాట్లాడలేదు.

"ఏమిటి, సంతకం పెట్టవా?"

"పెడతాను. వారిని చూడాలి."

"నీ మొండితనం మాత్రం ఏం మారలేదు. సరే, యిక్కడికి రప్పిస్తాను. అప్పుడైనా నమ్ముతావు కదూ! ఇద్దరు కలిసి యేమైనా వేషాలు వెయ్యొచ్చనను కుంటే మాత్రం యిద్దర్నీ యిక్కడే సమాధిచేసేస్తాం. అసలు నిన్ను చంపేసే అని యెలాగూ నాకే దక్కు తుంది. కాని పోలీసులకి అనుమానంవస్తే అంతా బెడిసి కొడుతుందని, యింతగా ప్రాధేయపడుతున్నాను సంతకం కోసం!" అతను తలుపు ఓరవాకిలిగా తీశాడు. గుమ్మం దగ్గర చింపాంజీ సిద్ధంగా వున్నాడు.

"వాడ్ని తీసుకురా?" అన్నాడతను.

చింపాంజీ వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాల్లో తిలక్‌ని తీసుకొచ్చాడు.

భర్తని చూడగానే ఆనందబాష్పాలు రాల్చింది లలిత. తిలక్ ఆమెవంక ఆర్తిగా, ఆత్రుతగా చూస్తు న్నాడు. అతని చేతులు వెనక్కి విరిచి కట్టేశాడు చింపాంజీ. నోట్లో గుడ్డలు కుక్కాడు.

మూగగా తనవంక చూస్తున్న భర్తనుచూసి కన్నీరు ఆగలేదామెకు.

"ఊ, యిప్పుడిక సంతకం పెట్టడానికి అభ్యంతరం లేదు కదూ!" కలం, దస్తావేజులు ఆమెముందు పెట్టాడు అతను.

తిలక్ తల అడ్డంగా తిప్పాడు పెట్టవద్దన్నట్టుగా. అతని భావం ఆమెకర్థంకాలేదు.

కలం తీసుకుంది.

మళ్ళీ తల అడ్డంగా తిప్పాడు తిలక్.

ఆమెకి బోధపడింది! తీరా సంతకం పెట్టాక బావ తమని ప్రాణాలతో వుంచుతాడని గ్యారంటీ యేమిటి? తమని వదిలేస్తే పోలీసులకి చెప్పి గొడవ చేస్తామని భయ పడటం సహజం! సంతకం చేయించుకుని తమిద్దర్నీ కొండమీదినుంచి లోయల్లోకి తోసి చంపేస్తే ఆదుకోగల దిక్కు లేదు!

"పెట్టు! ఓహో, నీ పతి దేవుడు వద్దని చెప్తున్నాడు కదూ! ఏరా, రాస్కెల్! బతకాలని లేదా?" అతను తిలక్ రెండు చెంపలు ఛెళ్ళు ఛెళ్ళున చరిచాడు.

తిలక్‌కి కళ్ళు తిరిగినట్టనిపించింది.

"జాగ్రత్త! నిలువునా కోసేసి ఉప్పు కారం పెట్టగలను!" అన్నాడతను కళ్ళెర్రజేస్తూ.

"బావా, ఆపు! నీక్కావలసింది యీ సంతకమే కదూ, ఇదుగో పెడ్తున్నాను...." అంటూ కలం తీసుకుని సంతకం పెట్టెయ్యటానికి సిద్ధపడింది.

"వద్దమ్మా, పెట్టకు!" అన్న మాటలు వినిపించి అందరు త్రుళ్ళిపడి గుమ్మంవైపు చూశారు.

తొందర్లో తలుపుకి బోల్టు పెట్టడం మరిచినందుకు నాలిక్కరుచుకున్నాడు చింపాంజీ.

గుమ్మంలో డాక్టర్ నిలబడి వున్నాడు. అతని చేతిలో రివాల్వర్ సూటిగా లలిత బావ గుండెలకు గురిపెట్టబడి వుంది!

లలిత బావ వేగంగా కదలబోయాడు.

డాక్టరు హెచ్చరించాడు. "మిస్టర్, పిచ్చివేషాలు వెయ్యాలని ప్రయత్నించకు! నేను దయ చూపించను! కాల్చటానికి యేమాత్రం సంకోచించను. మీ ఫ్రెండుని

ఇప్పుడే కట్టిపడేసి వస్తున్నా."

డ్రాయరు సొరుగులో వున్న రివాల్వర్ అందుకో వాలనుకున్న లలిత బావ ప్రయత్నం ఫలించలేదు.

అయితే డాక్టరు పక్కనుంచి వచ్చే ప్రమాదాన్ని చూసుకోలేదు. చింపాంజీ చేతిలోని కత్తి సూటిగా వచ్చి డాక్టరు చేతికి గుచ్చుకుంది.

రివాల్వర్ నేలమీద పడిపోయింది.

ఒక్క అంగలో యెగిరి అందుకున్నాడు రివాల్వర్ ని లలిత బావ. మరుక్షణం డాక్టరుని నిర్దాక్షిణ్యంగా కాల్చేసేవాడే!

కాని లలిత ఒక్కసారిగా బావమీదపడి రివాల్వర్ ఎగరగొట్టేసింది. ఆమె అంత వేగంగా తనమీదకొచ్చి పడుతుందని ఊహించని ఆమె బావ ఓ క్షణం బిత్తర పోయాడు.

రివాల్వర్ సరిగ్గా తిలక్ కాళ్ళ ముందుకొచ్చిపడింది.

చింపాంజీ వంగి అందుకోబోయాడు. కాని సరిగ్గా అదే క్షణంలో తిలక్ రివాల్వర్ ని డాక్టరు దగ్గరకు తన్నేశాడు. వంగిన చింపాంజీని మరో కాలితో డొక్కలో తన్నాడు. చింపాంజీ ఎగిరి అంత దూరంలో పడ్డాడు. అతని తలపోయి గోడకు బలంగా కొట్టుకుంది.

డాక్టరు లలిత బావని, చింపాంజీని రివాల్వర్ తో కవర్ చేస్తున్న సమయంలో లలిత ఒక్కపరుగున పోయి తిలక్ కట్లు విప్పేసింది. నోట్లో గుడ్డలు తీసేసింది.

డాక్టరు కుడిచేతినుంచి రక్తం ధారాపాతంగా కారి పోతోంది. ఎడమచేతితో నే రివాల్వర్ పట్టుకుని నిశ్చలంగా నించున్నాడు. లలిత తన చీర చెంగు చింపి డాక్టరు చేతికి కట్టుకట్టింది, రక్తం స్రవించకుండా.

తర్వాత లలిత, తిలక్ లలిత బావని, చింపాంజీని తాళ్ళతో మంచం కోడుకి కట్టిపడేశారు! వాళ్ళు ఏమిటో కోక్కోబోయారు, కాని డాక్టరు చేతిలోని ఆయుధం వాళ్ళ నోరు నొక్కేసింది.

లలిత, తిలక్ డాక్టరువంక కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ చేతులు జోడించారు.

డాక్టరు చిన్నగా నవ్వి, "ఈ అమ్మాయిని గెడ్డపోడు ఎత్తుకురావటం చూశాను. ఫాలో అయ్యాను. సమయానికి రక్షించగలిగాను. థాంక్ గాడ్! మీరిళ్ళి గెస్టు హౌస్ యజమానికి తెలియజెయ్యండి. వీళ్ళ సంగతి వాళ్ళే చూసుకుంటారు. మీరొచ్చేవరకు వీళ్ళని అంగుళం కదలనివ్వను!" అన్నాడు.

లలిత బావ, చింపాంజీ బోనులోపడ్డ పులుల్లాగా గుర్రుగా చూశారు డాక్టరు వంక.

తిలక్, లలిత గెస్టు హౌస్ వైపు ఉత్సాహంగా అడుగులు వేశారు.

—: అయిపోయింది: —